కథ

గోదావరీ జలాలలో మునిగి వచ్చిన గాలి నన్ను తాకింది. బాగా చలివేసింది. చీరకొంగు తలమీదనుంచి కప్పుకొని బెంచిమీద నుంచి లేచాను.

నిర్జీవముగా ఉంది పార్కు, జాతర ముగిసిన మరునాటి గుడి ప్రాంగణంలా వుంది. జీవితాలకు విద్యుద్దీపాలని అలంకరించే పిల్లలు కేరింతలు కొడుతూ ఆడుకుంటూ వెళ్లిపోయారు.




ఆడుకుంటున్న పిల్లల మోముల్లో విరిసిన ఇంద్రధనస్సులు చూసి మురిసిపోయిన పెద్దలు ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయారు. వెలుగురేఖలు సమంగా పడని చోట, కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ తమకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకున్న యువజంటలు కూడా కదలిపోయాయి.

ఇంకా అక్కడ ఉండటం నావల్ల కాలేదు. బయటకు నడిచాను. పూర్ణేందువనే బొట్టు చెరిగిపోయిన ప్రపంచం అమావాస్య చీకటిలోకి జారుతోంది.

రోడ్డుమీదకు వచ్చాను. ఇప్పుడు ఎక్కడకు వెళ్లటం?

ఇంటికి వెళితే.....

ఏముంది, ఇంట్లో.....

నాలాగే ఏ నిమిషంలోనైనా కూలిపోవటానికి సిద్ధంగావున్న ఇంట్లో చేసేదేముంది? పెచ్చులు ఊడిపోయి, రంగులు వెలసిపోయిన గోడలని చూస్తూ కూర్చోవటం తప్ప చేసేదేముంది?

లేను. నేను ఇంటికి వెళ్లలేను.

ముందుకి నడిచాను. నాలుగు అడుగులు వేసేనో లేదో ఆగిపోయాను. రోడ్డు మలుపు తిరిగే చోట గుమిగూడి ఉన్నారు, జనం. ఏవేవో మాటలు వినబడుతున్నాయి.

"ఏమయింది?" గబగబ నడిచి వాళ్లని సమీపించి అడిగాను.

నా మాటలు ఎవరూ పట్టించుకోలేదు. నన్ను అదోలా చూసి, వాళ్ల మాటల్లో వాళ్లు మునిగిపోయారు. ముసలిదానికి జవాబివ్వటమేమిటనేది కాబోలు వాళ్ల భావం.

"కళ్లూ, కాళ్లూ పని చెయ్యని వాళ్లు ఇంట్లో పడి ఏడవవచ్చుకదా?" నూనూగు మీసాల యువకుడు ఒకడన్నాడు.

"రోడ్డు మీదకు వచ్చి మమ్మల్ని ఏడిపించటమెందుకు?"

"ఏ రాచకార్యాలు మునిగిపోతాయని వీళ్లు రోడ్డుమీద తిరుగుతున్నారో?" మరొకడు వంత పాడేడు.

"నాకూ అదే అర్థం కావటం లేదురా" మరో యువకుడు అన్నాడు. "తిరిగినంత కాలం తిరిగారు కదా? కళ్లు, కాళ్లూ ఆడనప్పుడయినా, ఇంట్లో పడి వుండవచ్చు కదా?"

మరికొంత దూరం ముందుకు సాగాను. అప్పుడు కనబడింది ఆ దృశ్యం--చేతికర్ర సహాయంతో లేవటానికి ప్రయత్నిస్తోంది, రోడ్డుమీద పడిన ముసలావిడ. సుమారు ఏడుపదుల సంవత్సరాలు దాటి వుండవచ్చు ఆవిడకి.

"నన్నెందుకురా ఆడిపోసుకుంటారు" చేతికర్రను రోడ్డుమీద ఆన్చుకుని మెల్లగా అడిగింది ఆవిడ. "నువ్వే కదా వచ్చి నన్ను గుద్దేసింది?"

నేను చుట్టూ దృష్టి మళ్లించేను. రోడ్డువారగా పడివుంది, ఒక స్కూటర్. ఆ స్కూటర్‌ను ఆనుకుని నిలబడివుంది ఓ పాతికేళ్ల అమ్మాయి.

"నువ్వెళ్లమ్మా, ఈవిడ మాటలతో మనకేం పని?" రోడ్డుమీద పడివున్న స్కూటర్‌ని పైకి లేపి ఆమెకి అందిస్తూ అన్నాడు ఒక కుర్రవాడు.

"ఆవిడరోజులు ఎప్పుడో గడిచిపోయాయి"

నిజమే! ఆవిడ రోజులే కావు, ఆవిడలాంటి, నాలాంటి ముసలివాళ్ల రోజులు ఎప్పుడో గడిచిపోయాయి. కానీ కృంగి కృశించి, పాయలా ప్రవహించినా, గోదావరి జీవనదియని ఇరువైపుల జనానికి ప్రాణాయని అని బ్రతుకు చూడని కుర్రవాళ్లకి ఏమి తెలుస్తుంది?

జనాన్ని దాటుకుంటూ ముందుకి నడిచాను. ఎదురుగా వున్న గోదావరి స్టేషన్ చేరుకోవటమే నా లక్ష్యం.

చీకటిగా ఉంది స్టేషన్ ఆవరణ. జీవితపు వసంతకాలంలో వచ్చిపోయే అతిథుల కోసం, చుట్టాల కోసం అహర్నిశలూ శ్రమపడి, అలసిపోయి, అకాలవార్ధక్యంలోకి జారిపోయి, నీరసంగా పడుకున్న, అతివలా వుంది స్టేషన్. ఏ మాటలు అన్నా ఎదురు తిరగరనే ధైర్యంవల్ల ముసలివాళ్లమీద విసిరే దుర్భాషితాల్లా, స్టేషన్ చుట్టూ చెత్తా, చెదారము విసరేసి ఉన్నాయి.

మెల్లగా అడుగులు వేసి ప్లాట్‌ఫారం ఎక్కాను. ఏ నిమిషంలోనైనా ఆగిపోయే ముసలివాని గుండెలా వెలిగి ఆరుతోంది ఒకే ఒక ట్యూబ్‌లైటు. ఒకప్పుడు సరకులమ్మిన దుకాణాలు, సందడిగా ఉన్న ఆఫీసు గదులు ఖాళీగా, గాలితీసిన బెలూన్లలా ముడుచుకుపోయి ఉన్నాయి.

ముందుకి నడిచాను. ప్లాట్‌ఫారంమీద నిద్రపోతున్న ముసలికుక్కలు ఓసారి బద్ధకంగా కళ్లు తెరిచి చూసి మళ్లీ పడుకున్నాయి.

రోజూ ఆ ప్లాట్‌ఫారంమీద గంటల తరబడి కూర్చోవటం నాకు అలవాటు. ఏ బండి ఆగని గోదావరీ స్టేషన్ నా బ్రతుకుకి ప్రతీకలా అనిపిస్తూ ఉంటుంది.

ఒక కుర్చీమీద నడుం వాల్చాను. కాళ్లూ, చేతులూ నొప్పిగా ఉన్నాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచీ తిరుగుతూనే ఉన్నాను. ఏమీ తినలేదు, త్రాగలేదు. కళ్లు మూతలు పడుతున్నాయి.

పట్టిపట్టని నిద్రలో ఎవరో లేపినట్లు తోచింది, కర్రతో ఎవరో పొడిచినట్లు బలవంతంగా కనురెప్పలు విప్పాను. ఎదురుగా నిలబడి ఉన్నాడు గుబురుమీసాల హెడ్డు.

"ఏమిటే ముసలీ, నీకు రోజూ చెప్పాలా. ఇక్కడ తొంగో కూడదని, ఇదేమన్నా నీ బాబుగాడి సొమ్మా..." కర్రతో మరోసారి పొడిచాడు హెడ్డు. హెడ్డుతో నాకు బాగా పరిచయమే ఆగని ట్రైన్‌లని చూస్తూ స్టేషన్‌లో గంటలు గడిపే నాతో అప్పుడప్పుడూ కబుర్లు ఆడుతుంటాడు. అతను "టీ"కని, సిగరెట్లుకనీ అయిదూ, పదీ తీసుకుంటూ ఉంటాడు.

మెల్లగా లేచాను. నిన్ననే వాడికి పాతిక రూపాయలు ఇచ్చాను. ఆ డబ్బు పుచ్చుకున్నప్పుడు ఎంతబాగా మాట్లాడడో!

వాడిని నాలుగు తిట్టాలనీ, ఛడామడా దులపాలనీ, నోరు తెరిచాను. కానీ...

అంతలో గుర్తుకువచ్చింది.

వాడు పుచ్చుకున్నది పాతిక రూపాయలేగా!

తన జీవితమంతా పుచ్చుకున్న కొడుకు ఏమి చేశాడు!

పది సంవత్సరాల క్రితం ఇక్కడే బండి ఎక్కేడు వాడు. ఉద్యోగంలో చేరి రెండునెలలు పోయాక వచ్చి నన్ను తీసుకుని వెళతానన్నాడు. కానీ....

వాడు రాలేదు. ఇప్పుడు గోదావరీ స్టేషన్‌లో బళ్లే ఆగటం లేదు.

చీర కొంగుతో కళ్లు ఒత్తుకున్నాను.

ఆయన పోయినప్పుడు బొత్తిగా పదేళ్లు కూడా లేవు వాడికి.

ప్రపంచంలోని వెలుగుని తన గుప్పెట్లో పెట్టుకుని, పశ్చిమార్థంలోనికి దూకుతున్న సూర్యుడుని చూస్తూ ఇంటి గుమ్మంలో నిలబడ్డాను నేను. ఏదో బండి ఆగిన శబ్దం విని తల ఎత్తి చూశాను. నలుగురు ఆయునను మోసుకొని వచ్చి గుమ్మందగ్గర పడుకోబెట్టారు. నా కళ్లు తిరిగాయి. ఎంతసేపు అలాగ గడిచిపోయిందో తెలియదు. తెలివి వచ్చినప్పటికి ఇల్లంతా హడావుడిగా ఉంది. చుట్టాలు, స్నేహితులూ ఇంటినిండా ఉన్నారు. "పాపం సముద్రంలో పడిపోయారట" వీధి గుమ్మం అవతల పడుకోబెట్టిన అతని కళేబరాన్ని చూసి వెళ్లేవారి మాటలు నా చెవిలో పడ్డాయి.

నేను కదలలేదు. చుట్టూవున్న ప్రపంచం ఓ పెద్ద సున్నాలా అనిపించింది.

"జరిగిందేదో జరిగిపోయింది" ఓ ముసలావిడ నా దగ్గరకు వచ్చి అంది. 'బాధపడకు. బాధ పడితే పోయిన ఆయన వస్తారా, అమ్మా?'

"ఎంతో కొంత చదువుకున్న దానివి నీకు చెప్పదగ్గదానిని కాదనుకో" మరో ముసలావిడ అంది. "ఓ పది సంవత్సరాలు కష్టపడ్డావంటే నీ కొడుకు చేతికి అందివస్తాడు. ఆ తర్వాత నీ కష్టాలు తీరిపోతాయి."

నిజమే! వీడు ఎదిగితే ఇంక కష్టమేముంటుంది.

నేను లేచాను. శక్తి కూడగట్టుకుని ముందుకు నడిచాను. శుక్లపక్షపు చంద్రునిలా దినదిన ప్రవర్ధుడయ్యాడు వాడు. పదిహేను సంవత్సరాలలో పూర్ణ చంద్రునిలా ఎదిగాడు.

ఇంజనీరింగ్ చదివాడు. గుజరాత్‌లో మంచి ఉద్యోగం వచ్చింది. ఉద్యోగానికి బయలుదేరుతూ వాడన్నమాటలు ఇంకా నా చెవిలో గింగురుమంటున్నాయి.

ఈ ప్లాట్‌ఫారంమీదే బండి ఆగింది. బండి బయలుదేరకముందు బండిలోంచి చేతులు బయటకు చాచి నా కన్నీళ్లు ఒత్తుతూ అన్నాడువాడు. "బాధపడకమ్మా. ఓ రెండునెలల్లో ఇల్లు చూసి నిన్ను తీసికెళతానులే".

బండి వెళ్లిపోయింది. అంతవరకూ చిక్కని వెన్నెలను అందించిన, మబ్బు తెరవెనుక జారుకున్న చంద్రుని వెలుగులో అడుగులు వేశాను ఇంటివైపు.

రోజులు గడిచిపోయాయి. ఆరునెలలు తర్వాత వచ్చింది మొదటి ఉత్తరం--వాడు అమెరికా వెళతాడట! ఆశగా ఉత్తరాన్ని అటూఇటూ తిప్పి చూశాను. వాడి చిరునామా ఎక్కడా కనబడలేదు.

గట్టిగా నిట్టూర్చి కళ్లు ఒత్తుకున్నాను.

బ్రతుకువేగం పుంజుకుంది. సైకిలుమీద వెళ్లేవారు స్కూటర్‌లోకి మారారు. రోడ్డు నిండా కనబడే సైకిల్ రిక్షాలు ఆటోలకి దారి ఇచ్చి కనుమరుగైపోయాయి. అక్కడక్కడా కార్లు కూడా కనబడుతున్నాయి.

గోదావరీ స్టేషన్‌లో ఆగే బళ్ల సంఖ్య తగ్గిపోయింది. మానవసంబంధాలను కలపటం కోసం సంవత్సరాల క్రితం నిర్మించిన వారధి బలహీనమయిపోయిందట!

చూపు మందగించింది కానీ, ఎదురు చూపు మానలేదు. ప్రతీరోజు వచ్చి ఈ బల్లమీద కూర్చుంటూనే ఉన్నాను.


ఇక్కడే కనబడ్డాడు. ఓ రోజు సుబ్బారావు. సుబ్బారావు మాఊడువాడే--అమెరికాలో ఉంటున్నాడని విన్నాను.

నా మనసుకి పట్టిన ముసురు పూరంతా పాకినట్లు అయింది. ఆ రోజు చిన్న తుంపరలు కూడా పడుతున్నాయి. వానజల్లు నుంచి తప్పించుకోవటం కోసమని కొంతదూరంలో ఉన్న బల్లవైపు నడుస్తూ వుంటే, కనబడ్డాడు సుబ్బారావు.

"మీరు మీరు...." అతను సుబ్బారావు అవునో, కాదో అనే అనుమానంతో నా గొంతు తడబడింది.

"నేను సుబ్బారావునే సీత" సుబ్బారావు అన్నాడు. "బావున్నావా అని నేనడగను. ఎందుకంటే నువ్వెలాగున్నావో నాకు తెలుసు కదా?" అతను చేతిలో ఉన్న పైపు ఓసారి నోట్లో పెట్టుకొని గట్టిగా పొగపీల్చి అన్నాడు.

"నీ కొడుకు గురించి నీవేమి అడగబోతున్నావో నాకు తెలుసు. పాపం పిచ్చిది తల్లి మనసు" సుబ్బారావు ఓ నిమిషం ఆగేడు. ఆ తర్వాత అన్నాడు "వాడికి ఏమిటమ్మా! బ్రహ్మాండంగా ఉన్నాడు. దొరసానిని పెళ్లి చేసుకున్నవాడికి అమెరికాలో లోటేమిటమ్మా?"



ఆకాశం ఓసారి వురిమింది. ఆ వురుములకు తట్టుకోలేక నేను కళ్లు, చెవులూ మూసుకున్నాను.

పెనుతుఫానే వీచింది. అంతవరకూ మూగగా ఓ పాయలా రోదిస్తూ వెళ్లిన గోదావరి తల్లి, గుండెలోని దుఃఖం కట్టలు తెంచుకొని ప్రవహించి ఒడ్డున వున్న ఇళ్లని జలమయం చేసింది.

వివరం విని వచ్చింది మా చెల్లెలు. తనతో రమ్మని బలవంతం చేసింది. "మేమేమన్నా పరాయివాళ్లమా చెప్పు, నా పిల్ల నీ పిల్ల కాదా?" నా చెల్లెలు అంది. 'వాడు పోతే పోయాడు మాతో వుండవచ్చు కదా?'

ఉండాలనే అనుకొన్నాను. ఆ ఉద్దేశ్యంతోనే దాని వూరు వెళ్లాను. అంతా బాగుంటే ఉద్యోగం బదిలీ చేయించుకోవాలని కూడా అనుకున్నాను. కానీ....

"పెద్దమ్మ వాళ్ల ఊరు ఎప్పుడు వెళుతుందమ్మా?" బయటకి వెళ్లి వస్తున్న నేను ఆ మాటలు విని ఆగిపోయాను.

"ఊరు వెళ్లదమ్మా ఇక్కడే ఉంటుంది".

"ఎందుకని?"

"పెద్దమ్మకి ఎవరూ లేరు కదమ్మా మనం తప్ప. అందుకే ఇక్కడే ఉంటుంది".

"నాకిష్టం లేదమ్మా" ఆధునిక చదువులు, సంస్కారములు నూరిపోసిన స్వార్థానికి బానిసైన అమ్మాయి ఖచ్చితంగా అంది.

"అలా అనకూడదమ్మా. పెద్దమ్మని మనం చూడకపోతే మరెవరు చూస్తారూ?"

"అది నాకు తెలీదు అసలే ఇల్లు ఇరుకు. దానికి తోడు ఆవిడ దగ్గు ఒకటి రాత్రంతా నిద్రపోనివ్వటమే లేదు".

"మందు తీసుకుంటే దగ్గు తగ్గిపోతుందిలే".

"దగ్గుకంటే మందు తీసుకుంటుంది కానీ ఆవిడ ఆలోచనలకి మందులు వాడలేము కదమ్మా?" ఓ నిమిషం మాటలు ఆగిపోయాయి. నేను ఇంటిలోకి అడుగుపెట్టాను.

"నేను జీన్సు వేసుకుంటాను. జుత్తు కత్తిరించుకుంటాను. అది నా ఇష్టం. ఆవిడ ఇష్టం కాదుకదా? అవన్నీ పెద్దమ్మకి ఎందుకమ్మా?"

"కూరంతా అలా ఏరిపారేస్తావేమిటి?" నా అడుగులు సవ్వడి విని కాబోలు మాటమారుస్తూ అంది నా చెల్లెలు.

"చూడమ్మా బాగా చూడు ఇదేమీ కూరకాదు, కరివేపాకు కూరలో కరివేపాకాకుని ఏరిపారేయక తినేస్తారా?"

నా స్థానం నాకు అర్థమయింది. ఆరోజే బయలుదేరాను మా వూరికి.

ఇంకా ఇక్కడే తొంగున్నావన్నమాట నిన్ను... నిన్ను.... మళ్లీ వచ్చాడు హెడ్డు.

మెల్లిగా లేచి ముందుకి నడిచాను. ప్లాట్‌ఫారం చివర కూలీలు ఆదమరచి నిద్రపోతున్నారు.

ప్లాట్‌ఫారం దిగి పట్టాలు దాటి గోదావరి ఒడ్డున నడిచి వెళ్లితే ఇల్లు చేరుకోవచ్చు.

ప్లాట్‌ఫారం దిగేను. జీవితంలో దాటవలసిన వివిధ ఘట్టాలు, ఎలాంటి పట్టాలు ఒకటి వెనుక ఒకటి కనబడ్డాయి. దృష్టి సారించి మెల్లిగా పట్టాలు దాటుకుంటూ ముందుకు సాగేను. ఆఖరి పట్టా దాటుతూ ఉంటే గుండె జారిపోయింది.

ఎదురుగా అతివేగంతో వస్తోందో ట్రైన్.

కళ్లు తిరిగిపోయాయి. పట్టాల మధ్యన పరచిన రాళ్లకు కాళ్లు తగిలి అవతల పడ్డాను.

కళ్లు తెరచినప్పుడు ఓ నులకమంచం మీద పడివున్నాను. ప్రపంచాన్ని కబళించిన చీకటి పూర్తిగా తొలిగిపోయింది.

ఉదయసూర్యుని వెచ్చని కిరణాలు, ఊడిపోయిన తాటాకుల సందులలో నుంచి వచ్చి నన్ను పలకరించాయి.

కళ్లు తెరచి చూశాను. ఎదురుగా నిలబడివున్నాడు ఓ కూలివాడు.

"ఒసే, అమ్మగారు లేచారే" నేను కళ్లు తెరవటం చూసి అతను ఆనందంతో అరిచేడు. "టీ నీళ్లు పట్రావే".

ఒకామె నా దగ్గరకు వచ్చింది చేతిలో ఒక చిన్న కారియర్ గిన్నె, చంకలో నెలల పిల్ల.

"టీ తీసుకోండి అమ్మగారు" ఆమె కారియర్ గిన్నె నాకు అందించి "టీ తీసుకుంటే బాగుంటుంది, ఓపిక వస్తుంది".

నేను ఇద్దరినీ చూస్తూ పడుకున్నాను. అస్సలు కదలలేదు.

"టీ మేము చేసింది కాదు అమ్మగారు. మీ కోసం హోటల్ నుంచి తెచ్చాను".

నేను ఇష్టం లేకపోయినా' టీ' అందుకోవలసి వచ్చింది.

"నాకు పని టయిము అయిపోనాది. నేను వెళతాను. నువ్వుండిపోయి అమ్మగారిని జాగర్తగా చూసుకో".

అతను వెళ్లిపోయాడు. వాళ్లద్దరూ గోదావరిపై కొత్తగా నిర్మించే వంతెన కోసం పనిచేసే కూలీలట. నన్ను రోజు ఆ రోడ్డుమీద చూస్తూ ఉంటారట. అంతేకాదు, నా గురించిన వివరాలు కూడా వాళ్లకి తెలుసట!

నులకమంచం మీద అసహనంగా కదిలేను. నేను ఇంటికి వెళ్లాలి. మంచం దిగుతూ ఉంటే పరుగెత్తుకొచ్చింది ఆమె.

"కదలకండి అమ్మా. మీరు పడుకోండి".

"లేదు. నేను ఇంటికి వెళ్లాలి".

"ఒద్దమ్మగారు. ఉండండి. ఇంటి దగ్గర మీకు ఎవరున్నారని? ఇక్కడే ఉండండి. మాకు కలిగింది మేము పెడతాము".

నేను ఆశ్చర్యంతో ఉండిపోయాను. లక్షలు సంపాదించే కొడుకు చెప్పని మాట దీని నోటి నుంచి రావటమేమిటి? సంపాదించే కొద్దీ, డబ్బుమీద ఆశ పెరుగుతుందని చెప్పటం నిజమే కాబోలు!

నేను మెల్లగా అడుగులు వేశాను. తడక తలుపు దాటుతూ వుంటే కాళ్లకి ఏదో మెత్తగా తగిలినట్లు తోచింది.

ఒంగి చూశాను.

సంవత్సరం నిండని ఆమె బాబు నా పాదాలని తడుముతున్నాడు.

హృదయం స్పందించింది. కానీ ముందుకి సాగేను. ఆ పసికందు చేతులు నా పాదాలను విడిచిపెట్టలేదు. పాదాలకి తగిలే చీర అంచులని పట్టుకొని లాగుతున్నాడు, వాడు బోసి నవ్వులు నవ్వుతున్నాడు. మనకు తెలియని భాషలో ఏవేవో చెబుతున్నాడు.

నాలో ఏదో చెప్పలేని స్పందన.

హఠాత్తుగా వాడిని ఎత్తుకున్నాను. వాడిని ఎత్తుకుని ముందుకి నడిచాను.

ఇంటి వైపు కాదు.

ఇరువైపులా వున్న మానవసంబంధాలను కలపటానికి, కొత్తవారధి నిర్మిస్తున్న కూలీలవైపు. ■

